# 'మహా శివరాత్రి'కి విస్తృత ఏర్పాట్లు

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- ఎస్పీతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 27: మహా శివరాత్రి జాతర నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. మార్చి 7నుంచి 9 వరకు జరిగే మహా శివరాత్రి జాతరకు సంబంధించిన ఏర్పాట్లను ఎస్పీ అఖిల్‌మహాజన్‌తో కలిసి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయా శాఖలకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఇబ్బందులు కలుగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మూడు షిఫ్టుల్లో పారిశుధ్య కార్మికులను నియమించి ఆలయ ప్రాంగణం, జాతర పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తాగునీరు, మూత్రశాలలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రతి వంద మీటర్లకు తాగునీటి ట్యాపులను ఏర్పాటు చేయాలన్నారు. కట్టుదిట్టమైన భద్రత వ్యవస్థ ఏర్పాటు చేయాలని, ప్రాంగణం మొత్తం సీసీ కెమెరాల ఆధీనంలో ఉండేలా చూడాలని, అవసరమైన చోట ఫ్లెక్సీలు, ఎంట్రీ, ఎగ్జిట్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ, భక్తుల రద్దీ పెరిగే నేపథ్యంలో తాత్కాలిక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలన్నారు. వారి వెంట డీఎస్పీ నాగేంద్రాచారి, టీపీవో అన్సారీ, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఆలయ ఈఈ రాజేశ్, ఏఈవో జయకుమారి, పట్టణ సీఐ కరుణాకర్, పర్యవేక్షకుడు నర్సయ్య ఉన్నారు.

### నేడు జాతర సమన్వయ కమిటీ మీటింగ్

మహా శివరాత్రి జాతరను పురస్కరించుకొని బుధవారం రాష్ట్ర బీసీ, సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఉదయం 11గంటలకు ఆలయ ఓపెన్‌స్లాబ్‌పై నిర్వహించే సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు.



ఆలయ పరిసరాలను పర్యవేక్షిస్తూ అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ అనురాగ్‌జయంతి

## ప్రతిపక్షంలో ఎల్ఆర్ఎస్ వద్దన్నోళ్లు..

# నేడు ఎట్ల కొనసాగిస్తరు

- ఆనాడు చేసిన విమర్శలు తప్పు అని కాంగ్రెస్ నేతలు ఒప్పుకోవాలి
- కేసీఆర్ నిర్ణయాలన్నీ ప్రజల సంక్షేమానికే
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్



ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎల్ఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌ను తెలంగాణ భవన్‌లో ప్రదర్శిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 27: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎల్ఆర్ఎస్‌ను వ్యతిరేకించిన కాంగ్రెస్, నేడు అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఖజానాను నింపుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. మంగళవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని, మార్చి నెలాఖరులోగా లేఅవుట్‌లను క్రమబద్ధీకరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారన్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సందర్భంలో లేఅవుట్‌ల క్రమబద్ధీకరణలో భాగంగా పేదలు నిర్మించుకునే ఇండ్ల అనుమతులు, రుణాల మంజూరుకు సంబంధించిన అనుమతుల సులభతరం కోసం ఎల్ఆర్ఎస్‌ను అమల్లోకి తెచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే కాంగ్రెస్ నేతలు విస్మరిస్తున్నారని మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలుచేస్తామని ప్రస్తుత మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి గతంలో అనేకసార్లు చెప్పారని గుర్తుచేశారు. తెలంగాణ సర్కారు నాడు కేసీఆర్ నాయకత్వంలో పేదప్రజల కోణంలో ఆలోచన చేసి ఎల్ఆర్ఎస్‌ను అమల్లోకి తెచ్చారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌ను అమలుచేయక తప్పడంలేదన్నారు. ఎల్ఆర్ఎస్‌ను బహిష్కరించండని చెప్పిన నాయకులు, తిరిగి అమలుచేస్తున్నారంటే పేద ప్రజలకు ఎంత ఉపయోగకరమైందో ఆలోచన చేయాలన్నారు. తెలంగాణ సమస్యల్ని తెలంగాణ గుండెతో ఆలోచించిన ప్రభుత్వం, కేసీఆర్ నాయకత్వంలోని నాటి ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏదైతే ఎల్ఆర్ఎస్ జీవోను పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయం సంతోషకరమన్నారు. ఇదే క్రమంలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ఉన్నప్పుడు నిర్ణయించిన ఎల్ఆర్ఎస్ ఫీజును వ్యతిరేకించిన కాంగ్రెస్ నాయకులు నేడు ఎటువంటి ఫీజులు వసూలు చేయకుండా ఉచితంగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. లేదంటే నాడు కేసీఆర్ ప్రభుత్వంపై చేసిన విమర్శలు తప్పు అని అంగీకరిస్తూ చెంపలేసుకోవాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, బొల్లి రామ్మోహన్, మ్యాన రవి, జక్కుల నాగరాజు, పాతూరి రాజిరెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నియోజకవర్గ సమావేశం విజయవంతం



మాట్లాడుతున్న వినోద్‌కుమార్



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు, కార్యకర్తలు

వేములవాడ, ఫిబ్రవరి27: బీఆర్ఎస్ వేములవాడ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అధ్యక్షతన మంగళవారం పట్టణంలోని మహారాజ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం విజయవంతమైంది. పార్టీ ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి, మండలస్థాయి కమిటీలు, ముఖ్య కార్యకర్తలు కలిపి దాదాపు 1500 మంది సమావేశానికి హాజరయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం కష్టపడి పని చేయాలని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ కార్యర్తలకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, సీనియర్ నాయకులు లోక బాపురెడ్డి, ఏనుగు మనోహర్‌రెడ్డి, న్యాలకొండ రాఘవరెడ్డి, తీగల రవీందర్‌గౌడ్, బండ నర్సయ్యయాదవ్, ఏశ తిరుపతి, ఎంపీపీలు బండ మల్లేశంయాదవ్, చంద్రయ్యగౌడ్, బైరగోని లావణ్య, జవ్వాజి రేవతి, జడ్పీటీసీలు మ్యాకల రవి, గట్ల మీనయ్య, నాగం భూమయ్య, పార్టీ అధ్యక్షులు గోస్కుల రవి, మ్యాకల ఎల్లయ్య, కమలాకర్, మల్యాల దేవయ్య, సత్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర కళాశాలలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

# ఆల్ ది బెస్ట్

నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

- పరీక్ష రాయనున్న 8,543మంది విద్యార్థులు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ)/తెలంగాణ చౌక్: ఇంటర్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభంకానున్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 8,543మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఫస్ట్ ఇయర్‌లో 4609, సెకండియర్‌లో 3,934 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. వీరి కోసం జిల్లాలో 18కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు కేంద్రాలకు అరగంట ముందే చేరుకోవాల్సి ఉంటుంది. ఉదయం 8.30గంటల నుంచే పరీక్షా కేంద్రం లోపలికి అనుమతి ఇస్తారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోనికి అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. అలాగే కేంద్రాల వద్ద విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

### పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి: డీఐఈవో

ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సీహెచ్ మోహన్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేటి నుంచి మార్చి 19వరకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని, జిరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. విద్యార్థులు కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు.

### ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

రుద్రంగి/వీర్నపల్లి, ఫిబ్రవరి 27: రుద్రంగి, వీర్నపల్లి మండల కేంద్రాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బుధవారం నుంచి జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐలు అశోక్, రమేశ్ మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో కోరారు. ఎవరైనా మైక్‌సెట్‌లు, డీజేలు పెట్టి విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### పూర్తయిన ఏర్పాట్లు

కోనరావుపేట/చందుర్తి, ఫిబ్రవరి 27: కోనరావుపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయినట్లు ప్రిన్సిపాల్ శ్రీ లక్ష్మి, డిపార్ట్‌మెంట్ అధికారి రాజయ్య తెలిపారు. ఫస్టియర్‌లో 320మంది, సెకండియర్‌లో 235మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వారు చెప్పారు. అలాగే చందుర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని అధికారి జీ మల్లేశ్ తెలిపారు. ఫస్టియర్‌లో 81మంది, సెకండియర్‌లో 107మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు ఆయన చెప్పారు.

## నేతన్నల ఆకలి కేక-మహా ధర్నా నేడే

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 27: సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే నేతన్నల ఆకలికేక- మహాధర్నా కార్యక్రమానికి ఆసాములు, కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం తంగళ్లపల్లిలోని సీఐటీయూ కార్యాలయం, టెక్స్‌టైల్ పార్క్‌లో నేతన్నల ఆకలికేక-మహా ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇక్కడ కూచన శంకర్, కనకయ్య, నర్సయ్య, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.


నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899. NT-319447-All

PLOT FOR SALE

★హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ, బాటసింగారం, శ్రీమిత్ర, జనచైతన్య, మౌంట్ ఒపేర, గ్రీన్ సిటీ, సుచిరిండియాలో ప్లాట్లు కొనబడును. నో Brokrs. 9553973999 / 6303049720. NT-313892

NAME CHANGE

★**Polu Sharada Vani**, **D/o. Polu Shankaraiah** (Before Marriage) changed my name as **Swargam Vani W/o Swargam Naresh** (after marriage) Huzurabad Dist, Karimnagar T.S. Hence forth I shall be called as **Swargam Vani W/o Swargam Naresh** All purpose. NTK-317481

CHANGE OF NAME

★**I, VANGA SHEKHAR, R/o. H.No. 5-10,** Mogilipet, Mallapur, Jagityal District-505 331, TS. Changed My Name as VANGA RAJASHEKAR S/o. Vanga Laxmi Rajam. NT-311630

★**I, MOHAMMED ABDUL RAHAMAN, R/o.** 7-2-1014, Mankammathota, Karimnagar, TS, have Changed My Name as MOHAMMED ABDUL RAHMAN, S/o. Mohd Abdul Raoof. NT-311630

★**I, CHALLA BHAGYAVVA, W/o. Challa** Balreddy, R/o. 3-84/39, Bandankal, Rajanna Sircilla, TS, have Changed My Name as CHALLA BHAGYALAXMI, W/o. Challa Balreddy. NT-311630

★**I, MOHAMMED ALI (Also Known as)** MOHAMMED ALI ABDUL, R/o. 5-6-247/1, Sutharipet, Jagityal, TS. I have Changed My Name as MOHAMMED MOHAMMED ALI S/o. Mohammed Abdul Ali. NT-311630

★**I, KOYA SUMA, D/o. Koya Laxman, R/o.** 1-49, Nagulapeta, Korutla, Jagityal, TS. I have Changed after Marriage My Name as DATURKA SUMASRI, W/o. Daturka Nagaraju. NT-311630

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం

200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి

50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571

91827 77194


# 'పది' విద్యార్థులకు ప్యాడ్లు

- 'గిఫ్ట్ ఏ స్మైల్'లో భాగంగా అందించిన కేటీఆర్
- స్టూడెంట్స్‌కు పంపిణీ చేసిన బీఆర్ఎస్ శ్రేణులు
- 3 వేలకుపైగా మందికి లబ్ధి



తెలంగాణ చౌక్: విద్యార్థులకు ప్యాడ్లు అందిస్తున్న చైర్‌పర్సన్ జిందం కళ, నాయకులు


తెలంగాణ చౌక్/సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 27: మార్చిలో జరిగే పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, పెన్నులు, సామగ్రిని అందించారు. ఈ క్రమంలో రామన్న ఆదేశాల మేరకు గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు విద్యార్థులకు ప్యాడ్లు, సామగ్రిని అందిస్తున్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గీతానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పరీక్షా ప్యాడ్లు, పెన్నులు అందజేసి, మాట్లాడారు. కేటీఆర్ ఆదేశాల మేరకు గివ్ తెలంగాణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలోని 17పరీక్షా కేంద్రాల్లో 3,800మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే సుమారు మూడు వేలకు పైగా విద్యార్థులకు గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా పరీక్షా సామగ్రిని అందజేసినట్లు తెలిపారు. ఇక్కడ బీఆర్ఎస్ రాష్ట్ర నేత చీటి నర్సింగరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు ఆకునూరి శంకరయ్య, సబ్బని హరీష్ ఉన్నారు.

- తంగళ్లపల్లిలోని జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు ఎంపీపీ పడిగెల మానస, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న పరీక్షా ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఇక్కడ పడిగెల రాజు, మాజీ ఉప సర్పంచ్ పెద్దూరి తిరుపతి, హెచ్ఎం శంకర్ నారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ కందుకూరి రామాగౌడ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బండి జగన్, నాయకులు ఎండీ హమీద్, రమేశ్, సాహేదా బేగం, తిరునహరి భానుమూర్తి, నేరెళ్ల అనిల్, విజయ్, తదితరులు ఉన్నారు.



సిరిసిల్ల రూరల్: విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేస్తున్న ఎంపీపీ మానస, నాయకులు

## సైన్స్‌పై ఆసక్తి కల్పించడం అభినందనీయం




విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న జిల్లా సైన్స్ అధికారి దేవయ్య

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 27: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తిని కల్పించడం అభినందనీయమని జిల్లా సైన్స్ అధికారి సామల దేవయ్య కొనియాడారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ క్విజ్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిన్న వయసు నుంచే విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి పెంచితే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలిపారు. ఇక్కడ ఎస్‌వో శైలజ, హెచ్ఎం ప్రేమలత, పావని, తిరుపతి, ఎంఎన్‌వో శ్రీనివాస్, ఎంపీటీసీ నర్సయ్య, తదితరులు ఉన్నారు.

## ఇద్దరిపై కేసు నమోదు : ఎస్పీ

తెలంగాణ చౌక్, ఫిబ్రవరి 27: భూకబ్జాలకు పాల్పడుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌కు చెందిన గుర్రం అంజయ్య తన వ్యవసాయ భూమిలో 45ఏండ్లుగా సాగు చేసుకుంటుండగా, అదే గ్రామానికి చెందిన కోడి అంతయ్య కబ్జా చేసి, బెదిరింపులకు పాల్పడ్డాడు. అలాగే అంకుసాపూర్‌కు చెందిన వట్టిమల్ల శ్రీనివాస్ నకిలీ భూపత్రాలు సృష్టించి బెదిరింపులకు పాల్పడగా, బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. ఎవరైనా భూ కబ్జాలు చేసినా, నకిలీ భూపత్రాలు సృష్టించి బెదిరింపులకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్‌మహాజన్ హెచ్చరించారు.

## 5కే రన్ విజయవంతం చేద్దాం

తెలంగాణ చౌక్, ఫిబ్రవరి 27: మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గానూ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మార్చి 3న నిర్వహించే 5కే రన్‌ను విజయవంతం చేయాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ మంగళవారం ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు. గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. 5కే రన్‌లో యువతీయువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆసక్తి గల అభ్యర్థులు వెబ్‌సైట్ (https//froms.gle/ d7RmMcdcsN94eHfu6)లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతిభ చూపిన 13మందికి సైకిల్ బహుమతి అందజేయనున్నట్లు వెల్లడించారు.

## కోమటి చెరువుకు మరమ్మతులు

రుద్రంగి, ఫిబ్రవరి 27: మానాలలో కోమటి చెరువు మత్తడి కోతకు గురికాగా, మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మరమ్మతు పనులకు ఎస్‌డీఎఫ్ ద్వారా రూ.22లక్షలు మంజూరు చేశారు. ఈ క్రమంలో వైస్‌ఎంపీపీ పీసరి భూమయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దేగావత్ తిరుపతి, నాయకులు మంగళవారం చెరువు మత్తడికి మరమ్మతు పనులను ప్రారంభించారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మానాల పీఏసీఎస్ చైర్మన్ ఏలేటి చిన్నారెడ్డి, నాయకులు శ్యామ్‌సుందర్, బాదనవేని రాజారాం, భుక్యా చందర్, భూమానాయక్, దేవదాస్, తదితరులు పాల్గొన్నారు.

## జ్వరం గుప్పిట్లో రేపాక

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 27: రేపాకలో దాదాపు 30మందికి పచ్చకామెర్లు వచ్చాయనే సమాచారం మేరకు మంగళవారం వైద్యాధికారులు గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి శరణ్య మాట్లాడుతూ, ఇంటింటా సర్వే నిర్వహించి, అనుమానితులుగా ఉన్న 18మందికి రక్త నమూనాలు సేకరించినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కాచి వడబోసిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. ఇక్కడ డాక్టర్ సుమన్, ఎంపీటీసీ కాథ సుమలత, హెచ్ఈవో వెంకటరమణ ప్రసాద్, పీహెచ్ఎన్ లలిత, ఎంపీహెచ్ఎస్ నయీం, తదితరులు ఉన్నారు.

## సర్కారు బడిలో సైన్స్ ఎగ్జిబిషన్

ముస్తాబాద్, ఫిబ్రవరి 27: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు చేసిన ప్రయోగాల వివరాలను ఎంపీడీవో పరిశీలించారు. ఇక్కడ ఎంపీడీవో భాస్కర్‌శర్మ, కాంప్లెక్స్ హెచ్ఎం రాజిరెడ్డి ఉన్నారు.

## టిప్పర్ ఢీకొని ఒకరి మృతి

బోయినపల్లి, ఫిబ్రవరి27: కరీంనగర్ జిల్లా గంగాధర మండలం వెంకంపల్లి అనుబంధ గ్రామం పిట్టలపల్లికి చెందిన గోదల కమలాకర్(42) గంగాధరలో సూపర్ మార్కెట్ నిర్వహిస్తుండేవాడు. వేములవాడలోని కోర్టుకు బైక్‌పై మంగళవారం బయలుదేరాడు. బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే దారిలో వెనుక నుంచి వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఘటనా స్థలానికి వచ్చి, మృతదేహంతో ఆందోళన చేపట్టారు. వేములవాడ గ్రామీణ, పట్టణ, చందుర్తి సీఐలు శ్రీనివాస్, కరుణాకర్, కిరణ్‌కుమార్, ఎస్ఐ శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకొని సముదాయించారు, కాగా, భూవివాదం నేపథ్యంలోనే కమలాకర్‌ను టిప్పర్‌తో ఢీకొట్టించి ఉంటారని పలువురు అనుమానం వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం సమీపంలోని సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. అజాగ్రత్తగా టిప్పర్ నడిపి కమలాకర్ మృతికి కారణమైన మహారాష్ట్రకు చెందిన డ్రైవర్ బాపురావుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## బద్ది పోచమ్మకు ఘనంగా బోనాలు

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 27: రాజన్న అనుబంధ దేవాలయమైన శ్రీ బద్ది పోచమ్మకు మంగళవారం భక్తులు ఘనంగా బోనాలు సమర్పించారు. డప్పుచప్పుళ్ల మధ్య నృత్యం చేస్తూ ఊరేగింపుగా బద్ది పోచమ్మ ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కల్లు పోసి.. సారె పెట్టి బోనాలు సమర్పించారు. బోనం సమర్పించడానికి క్యూలో బారులు తీరారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



తెలంగాణచౌక్‌లో ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడ, ఫిబ్రవరి 27: బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు జిల్లాలోని పలు చోట్ల ఆందోళన చేశారు. ఈ క్రమంలో వేములవాడ పట్టణంలోని తెలంగాణచౌక్‌లో బండి సంజయ్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. తర్వాత బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## స్వగ్రామానికి చేరిన మృతదేహం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 27: బొప్పాపూర్ గ్రామానికి చెందిన నిమ్మల రాజు నాలుగు రోజుల క్రితం బహ్రెయిన్‌లో మృతి చెందగా, మంగళవారం మృతదేహం స్వగ్రామానికి చేరింది. ఈ క్రమంలో శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

# టీబీ రహితంగా కంచర్ల, బొప్పాపూర్

- సిరిసిల్ల మున్సిపల్ తొమ్మిదో వార్డు కూడా..
- డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు



వీర్నపల్లి: కంచర్లలో వివరాలు వెల్లడిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు

సిరిసిల్ల రూరల్/వీర్నపల్లి/ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి27: వీర్నపల్లి మండలంలోని కంచర్ల, ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామాలతోపాటు సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని తొమ్మిదో వార్డును టీబీ రహితంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు ప్రకటించారు. వీర్నపల్లి మండలం కంచర్లలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది కంచర్లలో 60మందికి టీబీ పరీక్షలు చేయగా, ఒక్కరికి కూడా నిర్ధారణ కాలేదన్నారు. దీంతో గ్రామాన్ని టీబీ రహితంగా నిర్ధారించినట్లు తెలిపారు. టీబీ ప్రాణాంతక వ్యాధి కాదని, జాగ్రత్తలు పాటిస్తే నివారించవచ్చన్నారు. ఇక్కడ పీహెచ్‌సీ వైద్యాధికారి స్రవంతి, డీపీపీఎం బిగిందర్, ఎస్‌టీఎస్ మహిపాల్, ఎస్టీఎల్ఎస్ నాగరాజు, టీబీ నోడల్ సూపర్‌వైజర్ పద్మ, ఏఎన్ఎంలుఆశ కార్యకర్తలు ఉన్నారు.

- సిరిసిల్ల మున్సిపల్ తొమ్మిదో వార్డును టీబీ రహితగా డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు ప్రకటించారు. మంగళవారం తొమ్మిదో వార్డులోని కార్యాలయంలో వైద్య బృందంతో 35మంది వ్యాధిగ్రస్తుల వివరాలు సేకరించగా, అందరికీ నెగెటివ్ వచ్చింది. ఇక్కడ కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, టీం సభ్యులు బిగిందర్‌జేత్యా, డాక్టర్ లక్ష్మీప్రసన్న, సూపర్‌వైజర్ రాజేందర్ ఉన్నారు.

## చేపల మృతిపై విచారణ

ముస్తాబాద్, ఫిబ్రవరి 27: తెర్లుమద్దిలోని మోతుకుల కుంటలో చేపలు మృతి చెందిన ఘటనపై మత్స్యశాఖ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. గతంలో పూర్తి స్థాయిలో నీరు ఉండడంతో మోతుకుకుంటలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో పది వేల చేప పిల్లలు వదిలారు. ప్రస్తుతం చెరువులో నీటిమట్టం తగ్గడంతో ఉష్ణోగ్రత పెరిగి చేప పిల్లలు మృతి చెంది ఉంటాయని మత్స్యశాఖ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఇక్కడ జిల్లా మత్స్యశాఖ చైర్మన్ చొప్పరి రాంచంద్రం, సూపర్‌వైజర్ కిరణ్, గ్రామ ప్రత్యేకాధికారి వంశీకృష్ణ, కార్యదర్శి, సంఘం నాయకులు ఉన్నారు.

## రైతులకు అవగాహన

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 22: జిల్లెల్లలోని బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాలలో మంగళవారం హైడ్రోపోనిక్స్ సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు నూతన సాగు విధానాలను తెలుసుకోవాలని డాక్టర్ కే భవ్యశ్రీ సూచించారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడిని హైడ్రోపోనిక్స్ సాగు ద్వారా ఎలా పండించుకోవాలో వివరించారు. పురుగుల మందులు వాడకుండా జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా పంట సాగు చేసే విధానంపై అవగాహన కల్పించారు.

## బాధితుడికి సాయం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 27: మండల కేంద్రంలోని కేసీఆర్ డబుల్ బెడ్రూం కాలనీకి చెందిన శ్రీగాధ భాస్కర్ ఇటీవల ఇంటి పైనుంచి పడి గాయపడ్డాడు. ప్రస్తుతం దవాఖానలో చికిత్స పొందుతుండగా, చేయూత మిత్ర సంస్థ సభ్యులు మంగళవారం పరామర్శించి ₹10 వేలు అందించారు. ఇక్కడ సంస్థ సభ్యులు దూస శ్రీనివాస్, వడ్నాల ఆంజనేయులు, బాద గోపి, మందుగుల శ్రీనివాస్, మాదాసు నాగరాజు, వల్లకాటి సిద్ధిరాములు, సాదు సాయిరెడ్డి, రేవూరి లక్ష్మీనారాయణ, సుంకి భాస్కర్ ఉన్నారు.